క్లుప్తంగా

యోగాతో మహాయోగం



ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రతీరోజూ గంట సమయం యోగాకు కేటాయిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా శిక్షకులు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటర్నేషనల్ యోగా డే పురస్కరించుకుని హార్ట్ ఫుల్‌నెస్ యోగా అండ్ మెడిటేషన్ సంస్థ, శ్రీరామచంద్ర మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు సూక్ష్మ వ్యాయామం, ఆసనాలు, ప్రాణాయామం తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ మరో మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పారిశుద్ధ్య నిర్వహణపై అసహనం



జిమ్ ప్రాంతాన్ని చీపుర్లతో శుభ్రం చేస్తున్న వాకర్లు

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలోని పెద్ద చెరువు కట్టపై ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని మార్నింగ్ వాకర్స్ అసహనం వ్యక్తం చేశారు. బుధవారం జిమ్ పరిసరాలను శుభ్రం చేసి నిరసన తెలిపారు. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను మున్సిపల్ అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి జిమ్ పరిసరాలను ఎప్పటికప్పుడు సిబ్బందితో పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొండపాక(గజ్వేల్): ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు కొండపాక మండలంలోని కేజీబీవీ పాఠశాలలో మహిళా వాచ్‌మెన్ పోస్ట్‌కు దరఖాస్తులు స్వీకరిస్తామని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు 18 నుంచి 45 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండి, పదో తరగతి పాసై ఉండాలన్నారు. దరఖాస్తులను కేజీబీవీ మండల ప్రత్యేకాధికారికి అందజేయాలన్నారు. మరింత సమాచారం కోసం 93925 10825 నంబరులో సంప్రదించాలని సూచించారు.

అసిస్టెంట్ కుక్ పోస్టు..

ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు కొండపాక మండల టీఎస్ఎంఎస్ బాలికల హాస్టల్‌లో అసిస్టెంట్ కుక్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 7వ తరగతి పాసై 18 నుంచి 45 ఏళ్ల లోపు వారై ఉండాలన్నారు. దరఖాస్తును టీఎస్ఎంఎస్ మండల ప్రత్యేకాధికారికి అందజేయాలన్నారు. రెండు పోస్టులకు మండల స్థాయి కమిటీ సమావేశంలో ఎంపిక చేస్తామయన్నారు.

27న వారాంతపు సంత వేలం

కోహెడ(హుస్నాబాద్): కోహెడ వారాంతపు సంత వేలం ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి భూక్య దేవేందర్ రాథోడ్ బుధవారం తెలిపారు. అలాగే అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉన్న మూడు పాత భవనాల్లోని షెట్టర్లు అద్దెకు ఇచ్చేందుకు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనేందుకు ఆదివారం వారసంతకు రూ.లక్ష, ఒక షెట్టర్‌కు రూ.50 వేల చొప్పున డీడీ లేదా నగదు గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం ప్రారంభానికి ముందు అందజేయాలని సూచించారు. కాగా వారాంతపు, షెట్టర్ల వేలం కాల పరిమితి 2024 జూలై 1 నుంచి 2025 మార్చి 31 వరకు నిర్ణయించినట్లు తెలిపారు. మరిన్న వివరాలకు కోహెడ గ్రామ పంచాయతీ కార్యదర్శి (81870 00681)ని సంప్రదించాలన్నారు.

న్యాయం చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న యువతి

దుబ్బాకరూరల్: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన ప్రియుడు ఇంటి ముందు చేపట్టిన ప్రియురాలి ధర్నా బుధవారం రెండో రోజుకు చేరింది. సీఐ శ్రీనివాస్ యువతికి నచ్చజెప్పినప్పటికీ ఆమె నిరాకరించింది. తెల్లవారు జాము వరకు ప్రియుడి ఇంటి ముందు తల్లిదండ్రులు, కుటుంబీకులతో బైఠాయించింది. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. ధర్నా చేస్తున్న యువతికి న్యాయం చేయకుండా పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని జిల్లా మహిళా అధ్యక్షురాలు నవీన మండిపడ్డారు. యువతికి న్యాయం చేయాలని లేని పక్షంలో మహిళ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పాలిటెక్నిక్‌తో భవిష్యత్

- ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న చిన్నకోడూరు కళాశాల
- పదేళ్లుగా వంద శాతం ఉత్తీర్ణత
- నేటి నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం



పెద్దకోడూరు మహిళా పాలిటెక్నిక్ కళాశాల

చిన్నకోడూరు(సిద్దిపేట): సాంకేతిక విద్యతో విద్యార్థులు భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవచ్చు. అతి తక్కువ ఖర్చుతో నేరుగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశానికి అవకాశం ఉంది. వృత్తివిద్య పూర్తిచేసిన వారికి త్వరగా ఉపాధి అవకాశాలు వస్తాయి. ఈ సెట్‌తో యూనివర్సిటీ, ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశం కల్పిస్తారు. సాఫ్ట్‌వేర్, ఇరిగేషన్, రైల్వే, ఆర్టీసీ, ట్రాన్స్‌కో, డిఫెన్స్, ఎన్టీపీసీ వంటి తదితర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

కార్పొరేట్ తరహా బోధన

చిన్నకోడూరు మండల పరిధిలోని పెద్దకోడూరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సాంకేతిక విద్య అందించేందుకు అధునాతన పరికరాలు, సకల సౌకర్యాలు కల్పించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ల్యాబొరేటరీలు, పారిశ్రామిక విజిట్లు, ఇండోర్, అవుట్ డోర్ క్రీడలు, అద్భుతమైన హాస్టల్, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, 42 సీసీ కెమెరాలతో నిఘా, ఎల్ఈడీ ప్రొజెక్టర్, వర్చువల్ క్లాస్‌ల నిర్వహణ తదితర వసతులు ఉన్నాయి. ఈ కళాశాలలో మూడు కోర్సులు ఉన్నాయి. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ ఇలా ఒక్కో బ్రాంచ్‌లో 60 సీట్లు ఉన్నాయి.

భవితకు బాటలు

పాలిటెక్నిక్ కోర్సుతో భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చు. కోర్సు పూర్తి చేసిన వారు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగం చేయొచ్చు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయి. మా విద్యార్థినులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

– స్నేహలత, ప్రిన్సిపాల్

పాలిసెట్ తొలివిడత కౌన్సెలింగ్

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు, ఫీజు చెల్లించడం, స్లాట్ బుకింగ్ జూన్ 20 నుంచి 24 వరకు
- సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జూన్ 22 నుంచి 25 వరకు
- వెబ్ ఆప్షన్‌లు జూన్ 22 నుంచి 27 వరకు
- ఆప్షన్ ఫ్రీజింగ్ జూన్ 27
- సీట్ల కేటాయింపు జూన్ 30
- ఫీజు చెల్లింపు జూన్ 30 నుంచి జూలై 4 వరకు



తుది విడత కౌన్సెలింగ్

- ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయడం, స్లాట్ బుకింగ్ జులై 7, 8
- సర్టిఫికేషన్, వెరిఫికేషన్ జులై 9
- వెబ్ ఆప్షన్‌లు జులై 9, 10
- ఆప్షన్ ఫ్రీజింగ్ జులై 10
- సీట్ల కేటాయింపు జులై 13
- ఫీజు చెల్లింపు జులై 13 నుంచి 15 వరకు

బండి సంజయ్‌కు ఘన స్వాగతం



రేగులపల్లె స్టేజీ వద్ద బండి సంజయ్ కుమార్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారి కరీంనగర్ వస్తున్న బండి సంజయ్ కుమార్‌కు బుధవారం మండలంలోని రేగులపల్లె స్టేజీ రాజీవ్ రహదారిపై బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీ రుద్రమ, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగడి కృష్ణారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శనిగరం స్టేజీవద్ద..

కోహెడరూరల్(హుస్నాబాద్): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బండి సంజయ్ తొలిసారి కరీంగనర్ వస్తుండటంతో కోహెడ మండలం శనిగరం స్టేజి వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

మహాప్రభో.. ఆరు నెలలుగా జీతాల్లేవు



నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

పారిశుద్ధ్య కార్మికుల గగ్గోలు

మిరుదొడ్డి(దుబ్బాక): ఆరు నెలలుగా జీతాల్లేక అల్లాడి పోతున్నామని అధికారులకు గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మిరుదొడ్డి గ్రామ పంచాయతీ వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఆరు నెలలుగా జీతాల్లేకుండా తాము ఇబ్బందులు పడుతున్నామని, కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. జీతాల్లేక పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి బకాయి జీతాలను వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



మర్రిముచ్చాలలో వరి నారుమడిని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి నరేష్

నారుమడిలో సస్యరక్షణ చేపట్టాలి

మండల వ్యవసాయ అధికారి నరేష్

కొమురవెల్లి(సిద్దిపేట): వరి నారుమడిలో రైతులు సస్యరక్షణ చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి నరేష్ అన్నారు. బుధవారం మండలంలోని మర్రిముచ్చాలలో వరినారు మడులను రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నారుమడి పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎకరానికి సరిపడా నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్, మొగిపురుగు కనిపిస్తే ఎకరాకు 400 గ్రాములు కార్బొఫ్యూరాన్ 3జీ గుళికలు చల్లుకోవాలన్నారు.

అధిక సాంద్రత పత్తి పంటల పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని లింగారెడ్డిపల్లిలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తిసాగు చేస్తున్న పొలాలను బుధవారం ఏఓ వసంతరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో చెలక భూముల్లో పత్తి సాగు చేయాలన్నారు. నల్ల రేగడి భూముల్లో చేయొద్దని సూచించారు. పత్తి సాగు చేసే రైతులకు ప్రభుత్వం రూ.6700 రాయితీ ఇస్తుందని వివరించారు. మండలంలో ఇప్పటి వరకు 80 ఎకరాల్లో అధిక సాంద్రత పత్తి సాగు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ సమత, రాశీ సీడ్స్ కంపెనీ ప్రతినిధి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు నాటుకోవాలి

మద్దూరు(హుస్నాబాద్): తగిన వర్షపాతం మేరకు పత్తి విత్తనాలు నాటుకోవాలని ఏఓ రామకృష్ణ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని సలాఖపూర్, ధర్మారం గ్రామాల్లో మెలకెత్తిన పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 నుంచి 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు తర్వాతనే విత్తనాలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అఖిల్ పాల్గొన్నారు.

అంబులెన్సులో మహిళ ప్రసవం



బిడ్డను అందజేస్తున్న 108 సిబ్బంది

దుబ్బాకరూరల్: మండలంలోని బల్వంతాపూర్ గ్రామానికి చెందిన నిర్మలకు పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్సులో దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్కానింగ్ లేక పోవడంతో అక్కడ నుంచి సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా సిద్దిపేట శివారు రాంచంద్రనగర్ వద్ద అంబులెన్సులోనే శిశువుకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు. డాక్టర్ మహేశ్, 108 సిబ్బంది నర్సింహులు, పైలట్ నర్సింహులుకు నిర్మల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రాహుల్ ప్రధాని కావడం ఖాయం

ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డాక్టర్ సూర్యవర్మ



సిద్దిపేటలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



గజ్వేల్‌లో..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని సిద్దిపేట జిల్లా బీసీ సెల్ చైర్మన్ డాక్టర సూర్యవర్మ అన్నారు. జిల్లా బీసీ సెల్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం జిల్లా బీసీ సెల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి జంగోని శ్రీనివాస్, మోతె కుమారస్వామి, మండల అధ్యక్షుడు గరిపల్లి వెంకట్, డీసీసీ కార్యదర్శి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో..

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి కొండలవాడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి మాట్లాడుతూ రాహుల్ నాయకత్వంలోనే కాంగ్రెస్ పార్టీకి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఈనెల 24న హుస్నాబాద్‌లో నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గౌరవెల్లి గ్రామంలో ..

అక్కన్నపేట(హుస్నాబాద్): రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం మండలంలోని గౌరవెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ మంద పరశురాం గౌడ్ పిల్లలకు పలకలు, అరటి పండ్లను పంపిణీ చేశారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్: రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం గజ్వేల్‌లో ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఆదేశాల మేరకు నాయకులు పట్టణంలోని ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం, ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

టీపీసీసీ అధికార ప్రతినిధి ఆధ్వర్యంలో..

టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, గజ్వేల్, ములుగు మండలాల పార్టీ అధ్యక్షులు మల్లారెడ్డి, శ్రీనివాస్ గుప్త, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్, ములుగు మాజీ ఎంపీపీ వెంకట్రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా గజ్వేల్ కాంగ్రెస్ నేతలు రెండు వర్గాలుగా కార్యక్రమాలు నిర్వహించడం చర్చనీయాంశమైంది.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

గజ్వేల్‌రూరల్: ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఉమ్మడి జిల్లా గ్రీన్ హెల్త్ సర్వీస్ ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్ అన్నారు. బుధవారం గజ్వేల్‌లో 108, 102, 1962 వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలన్నారు. కాగా 1962 వాహన డ్రైవర్‌గా సేవలందించినందుకు జిల్లా ఉత్తమ పైలెట్‌గా ఎంపికైన కన్నారెడ్డికి అవార్డును ప్రదానం చేశారు.



అవార్డును అందజేస్తున్న జనార్దన్



విద్యార్థినులను ఓదారుస్తున్న పీఈటీ రవికుమార్

సార్.. మీరెళ్లొద్దు

కన్నీళ్లు పెట్టిన విద్యార్థినులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పీఈటీ బదిలీ సందర్భంగా ఆటల్లో మీరిచ్చిన ప్రోత్సాహం మమ్మల్ని క్రీడాకారులను చేశాయంటూ బుధవారం మండలంలోని తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు కన్నీళ్లు పెట్టుకున్నారు. సార్ మా బడి నుంచి వెళ్లొద్దని వేడుకున్నారు. 13 ఏళ్లుగా వ్యాయామ ఉపాధ్యాయుడిగా రవికుమార్ పనిచేశారు. ఎంతో మంది విద్యార్థులను జిల్లా నుంచి జాతీయ స్థాయిలో ప్రతిభ చాటేలా కృషి చేశారు. సార్ సేవలను గుర్తుచేసుకుని విద్యార్థులు కన్నీళ్లతో వీడ్కోలు పలికారు. విద్యార్థినులను రవికుమార్ ఓదార్చారు. ఆటల్లో రాణించాలన్నారు. ఎంపీటీసీ మంజుల, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, గ్రామ యూత్ నాయకులు పీఈటీని ఘనంగా సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

◆ నోట్‌బుక్స్ పంపిణీ

వర్గల్(గజ్వేల్): మండలంలోని శాకారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం సిద్దిపేటకు చెందిన దాత సురేష్‌కుమార్ నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. పుస్తకాలు పంపిణీ చేసినందుకు దాతను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యాయురాలు నీరజ పాల్గొన్నారు.

◆ ప్రజలకు సేవ చేసినప్పుడే సంతృప్తి

దుబ్బాకరూరల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు సల్కం మల్లేశం ఆధ్వర్యంలో మండలంలోని పోతారం గ్రామంలో అంబలి కేంద్రం ఏర్పాటు చేశాడు. కేంద్రం ప్రారంభించి 150 రోజులు కావడంతో కేంద్రంలో సేవలందించినవారిని ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ ప్రజలకు సేవ చేస్తే తృప్తి లభిస్తుందన్నారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రతీ ఇంటికి వాటర్ క్యాన్లు అందజేశానని, ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో విద్యా వలంటీర్‌ను నియమించి నెలనెలా వేతనం చెల్లిస్తున్నానని తెలిపారు.

◆ రక్తదానం చేసిన కానిస్టేబుల్

సిద్దిపేటకమాన్: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు కానిస్టేబుల్ రక్తదానం చేశాడు. రామక్కపేటకు చెందిన ఓ మహిళ అనారోగ్యంతో సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. చికిత్స సమయంలో ఆమెకు అత్యవసరంగా రక్తం అవసరం ఉందనే విషయం తెలుసుకున్న ఏఆర్ కానిస్టేబుల్ హరి వెంటనే స్పందించి ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశాడు. హరికి మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

◆ సీఎం చిత్రపటాల పంపిణీ

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అల్వాల గ్రామ పంచాయతీ, ప్రభుత్వ పాఠశాలలకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటాలను మాజీ సర్పంచ్ ఎనగంటి కిష్టయ్య బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలల్లో సీఎం చిత్ర పటం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు నీరటి రాజు, నాయకులు సత్యనారాయణ, హర్షద్ పాల్గొన్నారు.

◆ బాధ్యతల స్వీకరణ

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు తహసీల్దార్ అనిల్‌కుమార్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో సీసీఎల్ఏలో విధులు నిర్వహిస్తున్న సరిత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే ధరణి ఆపరేటర్ రాంప్రసాద్‌రెడ్డి మిరుదొడ్డికి బదిలీ కాగా, ఆయన స్థానంలో కొండపాకలో పని చేస్తున్న నవీన్ నంగునూరుకు బదిలీపై వచ్చాడు.

అక్బర్‌పేట-భూంపల్లి మండల తహసీల్దార్‌గా..

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల తహసీల్దార్‌గా అహ్మద్ ఖాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన హుస్నాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాగా ఇక్కడ పనిచేసిన జింక జయంత్ హుస్నాబాద్ ఆర్డీఓ కార్యాలయానికి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లారు.

◆ రుణమాఫీ చేయాలి

కోహెడ(హుస్నాబాద్): ఆగస్టు 15వ తేదీన రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేయాలని కోహెడ ప్యాక్స్ చైర్మన్ దేవేందర్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీపై సీఎం మాట తప్పారన్నారు. రుణమాఫీలో ఎలాంటి షరతులు విధించకుండా మాఫీ చేయాలన్నారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకోవాలని రైతుల పక్షాన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, యాద అశోక్, బండ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

◆ శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

దుబ్బాకటౌన్: ఛత్రపతి శివాజీని యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నాయకుడు ఆంజనేయులు అన్నారు. బుధవారం హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దౌల్తాబాద్ మండల కేంద్రంలో శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ దేవాలయ నిర్మాణానికి సహకరించండి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పందిల్లలో నిర్మిస్తున్న మహాలింగేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి మిల్లర్స్ సహకారం అందించాలని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం కోరారు. వారి విజ్ఞప్తికి గ్రామానికి చెందిన వ్యాపారులు, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన ఉద్యోగులు స్పందించినట్లు మాజీ సర్పంచ్ తోడేటి రమేశ్ తెలిపారు. అందరి సహకారంతో నిర్మాణం పూర్తిచేస్తామన్నారు.

◆ బీమా సొమ్ము అందజేత



హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం గాంధీనగర్ పురుషుల పొదుపు సంఘం సభ్యుడు దండుగుల రాజ్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం మృతుడి కుటుంబానికి పొదుపు సంఘం డబ్బుతో పాటు బీమా పరిహారం రూ.60 వేల నగదు అందజేసినట్లు సంఘం అధ్యక్షుడు కొడముంజ రవీందర్ తెలిపారు.